36

# బెంజమిన్ ఫ్రాంక్లిన్

మనకు బాగా ఆప్తుడయిన మిత్రుడిని ఏ ఏడాది తర్వాతో కలుస్తాము. 'ఏంవోయ్ కార్డు ముక్కయినా రాయలేదేం యిన్నాళ్ళూ?"— అని అతడడిగితే వెర్రినవ్వొకటి నవ్వి—"తీరిక లేకపోయిందోయ్" అంటాం. నిజానికి మనకు, ఆలోచించితే, గతసంవత్సరంలో మనం ఎక్కిన ఎవరెస్టులు గాని, సాధించిన ఘనవిజయాలు గాని ఏమీ లేవని మనకే తెలుసు. మామూలుగా రోజూ వెళ్ళే ఆఫీసు, తిండి, నిద్ర, సినిమా, ఏదో కాలక్షేపం తప్ప ప్రత్యేకంగా చేసిందేమి వుండదు. కాని ఉత్తరం రాయడానికి తీరిక లేకపోయింది.

అందుకనే ఏమీ పనిచేయనివాడికి తీరికే వుండదు, అన్ని పనులు చేసేవాడికి అన్ని పనులకు సమయం వుంటుంది అంటారు 'కాలం' నుండి ఇలా బహుళ ప్రయోజనాలు పొందే మనిషి జీవితానికి అందం ఉంటుంది, అర్థం వుంటుంది, నిండుదనం వుంటుంది.

నిండిన కుండ తొణకదు-అన్నారు మనవాళ్ళు.

ఖాళీ బస్తా నిలబడలేదు-అన్నారు ఇంగ్లీషువాళ్ళు.

కనుక నిండుకుండ అని, నిండినబస్తా అని వుంటుందని ఖాళీ కుండలకు, బోలు బస్తాలకు బోధపడకపోవడంలో ఆశ్చర్యం ఏమీలేదు. ఎందుకంటే, ముఖ్యంగా ఇది 'ఖాళీ బస్తాలు' వూరేగుతున్న యుగం కనుక!

ఈ భూమ్మీదే రెండు శతాబ్దాల క్రింద -

ఒకానొక వ్యక్తి ఒక జీవితకాలంలో — పత్రికా రచయితగా కవిగా, శాసన సభ్యుడిగా, రాజకీయవేత్తగా, పత్రికా సంపాదకుడిగా, ముద్రణాలయాధిపతిగా పోష్టుమాస్టర్‌గా, మబ్బులలోని మెరపుకున్న విద్యుచ్ఛక్తిని కనుగొనే సాధనాన్ని బైఫోకల్ కళ్ళజోడును, మేలురక, స్టవ్‌ను జలతరంగిణిలాటి వాయిద్యాన్ని తయారుచేసిన సైంటిస్టుగా, యుద్ధసమయంలో విజయవంతమైన వ్యూహరచయితగా, ఆస్పత్రి, లైబ్రరీ, సాహితీ సంఘంవంటి వాటన్నిటికి స్థాపకుడుగా, విశ్వవిద్యాలయ నిర్మాతగా —మనగలిగాడు అంటే — "కొయ్యకండి సార్! ఇంకేమయినా పురాణం చెప్పండి వింటాం—" అనబుద్ధివేస్తుంది.

రవీంద్రకవీంద్రుడు అన్నట్లుగా — పుస్తకాన్ని తింటూ ఆ పురుగు అనుకుంటుందిట—"ఆహా! ఇంత రుచికరమైన పదార్థాన్ని తినలేని మానవ జన్మ — ఏం జన్మ—!' అని మనిషిమీద జాలి పడుతుందిట, ఆ పురుగు లాంటి మనవాళ్లకు బెంజమిన్ ఫ్రాంక్లిన్ జీవితం చదివితే—ఇతడు ఒక వ్యక్తేనా, ఇతను సాధించినవన్నీ ఒక జీవితకాలంలోనేనా అని ఆశ్చర్యంతో గుండె ఆగినంత పని అవుతుంది.

కాని అమెరికాలో బెంజమిన్ ఫ్రాంక్లిన్ అన్న వ్యక్తి 1706 నుండి 1790 దాక బ్రతికాడు. పైన చెప్పినవన్నీ సాధించాడు!

ఆ మహావ్యక్తిని గురించి రాస్తూ కార్ల్‌వాన్‌డోరిన్— "మేధ, సంకల్పం, కళ, బలం, సంస్కారం. చమత్కారం వడపోసి మేళవించిన ఆ వ్యక్తిత్వాన్ని చూస్తుంటే - అతడిని రూపకల్పన చేస్తున్నప్పుడు ప్రకృతియే పరమానందంతో పులకరించిపోయి, మోతాదనే దానిని మరిచిపోయి, పాళ్ళను కలిపిందా అని అబ్బురం కలుగుతోంది! అతడొక వ్యక్తికాదు, పలు వ్యక్తుల వరుస! ఏ కాలంలోనయినా ఏ దేశములోనయినా అతడు మహామహుడే—"అంటాడు.

ఎందరో మహానుభావులవలెనే ఫ్రాంక్లిన్ బాల్యమూ కష్టాలతో, సమస్యలతో గడిచింది. పన్నెండవ ఏట బెంజమిన్ తన అన్నగారు నడిపే పత్రికతో 'అప్రెంటిస్'గా చేరాడు. కంపోజింగ్, ముద్రణ పనులు అయ్యాక పత్రిక ప్రతులను తీసుకువెళ్ళి చందాదారుల కందచేయడం అతడిపని, పత్రిక కార్యాలయానికి వచ్చే అన్నగారి మిత్రుల సంభాషణలు విని బెంజమిన్‌కు ఏదయినా రాయాలనిపించింది. కాని తాను రాసినట్లు తెలిస్తే అన్నయ్య అచ్చువేయడని తెలిసి, అతడు తన చేతిరాతను కూడా మార్చి మారు పేరుతో ఒక వ్యాసం రాసి, రాత్రివేళ ప్రెస్ తలుపుల క్రింద లోపలికి తోసేశాడు. మరు రోజు అన్నయ్య, మిత్రులు, అన్నిటితోబాటు ఆ వ్యాసం గురించి కూడా 'చర్చించి' మెచ్చుకుంటుంటే విన్న బెంజమిన్ సంబరపడియాడు, అది అచ్చయింది. ఆ విధంగా తను రాయగలనని, రాత ద్వారా ఇతరులను ఒప్పించగలనని తెలుసుకున్న ఫ్రాంక్లిన్ తర్వాతి కాలంలో తన రచనా పాటవాన్ని, వాదనాశక్తిని అనేక ప్రజాహిత కార్యక్రమాలలో వాడుకున్నాడు.

చిన్నప్పటినుండి నీళ్లన్నా, సముద్రం అన్నా ఈదడం అన్నా బెంజమిన్‌కు చాల మోజు! అలాగే పడవలు నడపడం సరదా కూడా వుండేది. వృద్ధాప్యంలో అతడు క్రొత్త ఓడల నమూనాలు ఇవ్వగల్గినా, మూడు మైళ్ళను అవలీలగా 'ఫీట్లు' చేస్తూ ఈదగల్గినా, ఈదడంలో కొత్త విధానాలు రూపొందించినా వాటి బీజాలు ఈ బాల్యపు మోజులో దాగి వున్నాయి. చిన్నప్పుడు ఊళ్ళోవున్న ఒక ఉప్పుటేరు లాటి దాని చివర బెంజమినూ, మిత్రులూ, ఆడుకుంటూవుండేవారు. బాగా తొక్కడం వలన అక్కడిగట్టు అంతా విరిగి పడిపోగా వాళ్లు చేపలు పట్టడానికి బురదలో నిలబడవలసి వచ్చేది. అంచేత ఆ చోట ఏదయినా రాళ్లతో గట్టు నిర్మించాలి అనుకున్న వాళ్లకు, ఆ ప్రక్కనే కట్టనున్న కొత్త ఇంటికోసం పేర్చిన రాళ్లు కన్పించాయి అంతే, సాయంకాలం ఆ కూలీలందరూ వెళ్లిపోయాక, బెంజమిన్ నాయకత్వంలో వానరసేనంతా, చప్పుడు చెయ్యకుండా ఆరాళ్లను తెచ్చి ఏటిఒడ్డున పకడ్బందీగా పేర్చి గట్టు నిర్మించారు! పొద్దునలేచి చూచి

ఆశ్చర్యపోయిన కూలీలకు ఆ రాళ్లు ఏటి ఒడ్డున కన్పించాయి ! వెంటనే కూపీలాగి ఆ పని చేసినవారెవరో కనుక్కొని వారి తల్లిదండ్రులకు ఫిర్యాదు చేసేరు, బెంజమిన్ తన తండ్రితో—"మేము కట్టిన ఆ గట్టు అందరికీ ఉపయోగకరంకదా!" అని వాదిస్తే ఆయన "నీతికి దూరమైన దేదీ ఉపయోగకరం కాజాలదు !" అన్నాడు. ఆ వాక్యం తన జీవితానికి వెలుగు దీపం అయింది అంటాడు బెంజమిన్ ఫ్రాంక్లిన్. ఇంత స్పష్టంగా "నీతి, ప్రయోజనం" ల ఘర్షణను విడదీసి చూపిన సంఘటనలు చాల అరుదే!

లండన్‌లో ఒక ముద్రణాలయంలో బెంజమిన్ కొంతకాలం పని చేశాడు. అక్కడి పని వలన తన శరీరానికి తగినంత వ్యాయామం కల్గడం లేదన్న కారణంగా అతడు 'టైపు' లున్న 'ఫారా'లను చేతులలో చెరొకటి మోసుకువెళ్ళడం చూచి మిగతా పనివారు ఆశ్చర్యపడేవారు-వాళ్ళంతా రోజుకు అయిదారుసార్లు బీరు తాగుతుండగా బెంజమిన్ బ్రెడ్ తిని, నీరు త్రాగేవాడు. బీరు త్రాగిన కొద్దీ బలం వస్తుందని నమ్మిన ఆ పనివారు తాము రెండు చేతులతో మోసే 'ఫారా'న్ని బెంజమిన్ ఒక చేత్తో మోయడం చూచి విస్తుపోగా-బెంజమిన్ వారికి-"మీరు తాగే బీరులో కరిగివున్న బార్లీ ఎంతవుందో అంత శక్తే మీకు వస్తూంది. మరి మీరేమో దానితోనే కడుపు నింపుకుని శక్తిలేదని బాధపడుతున్నారు. ఆ డబ్బుతో కొంత బ్రెడ్ తింటే బలం వుంటుంది " అన్నాడట. అయినా అలవాటుకు బానిస యినవాడికి వివరణలు, వివేకాలూ అంత సులభంగా తలకెక్కవుకదా-! ఆ పనివాళ్ళలాగే బీరుకూ, ఇతర మద్యపానానికీ డబ్బు తగలబెట్టేవారు!!

పుస్తకాలవలన అమితంగా లాభం పొందిన బెంజమిన్ సాహితీ ప్రియులందరూ తరచు సమావేశం అయ్యేందుకని "జంటో'' అన్న గోష్ఠి బృందాన్ని ఏర్పాటు చేశాడు. మొదట ప్రతి శుక్రవారం ఒక పానశాలలో కలుసుకునే ఈ బృందం తర్వాత ఒక గది అద్దెకు తీసుకుంది. కొన్నాళ్ళ తర్వాత బెంజిమిన్-సభ్యులందరూ తమ దగ్గరున్న పుస్తకాలను అక్కడకు తీసుకువచ్చి వుంచితే అందరికీ అన్ని పుస్తకాలూ అందుబాటులో వుంటాయి అని సూచించగా ఆవిధంగా చేశారు. దీనినుండే బహుళ ప్రపంచంలోని

మొట్టమొదటి ''పబ్లిక్ సబ్‌స్క్రిప్షన్ గ్రంథాలయం'' ఆవిర్భవించింది. సభ్యత్వరుసుము క్రింద నలభై షిల్లింగులు, సంవత్సరానికి చందా పది షిల్లింగుల చొప్పున నిర్ణయించిన ఈ గ్రంథాలయంలోకి మొదట యాభై మందిని చేర్పించడమే కష్టం అయింది. అంటాడు బెంజమిన్. కాని అన్ని మంచి కార్యక్రమాలవలనే చాలా రాష్ట్రాలుదాటి, ఇది దేశమంతా వ్యాపించి, జ్ఞానవ్యాప్తికి దోహదం చేసింది.

ఇలాటి మహానుభావుడి గృహజీవితం ఎలా వుండేది ?

మిస్ రీడ్ అన్న ఆవిడను పెళ్ళాడిన బెంజమిన్ ఇలా అంటాడు "ఇంగ్లీషులో ఒక నానుడి వుంది—బాగుపడదలుచుకున్నవాడు భార్యను సంప్రదించకుండా ఏ పనీ చేయడు'' నాకు అలాంటి వివేకవతీ అనుకూల వతి భార్య అవడం నా అదృష్టం. ఆవిడ నా ప్రెస్ పనులలో సాయపడేది మా వద్ద అనవసరమైన నౌకర్లు వుండేవారు కారు. మా భోజనం చాలా సాదాగా వుండేది మా కున్న ఫర్నిచర్ కూడా చాల కొంచెమే !'' అలాంటి మితమైన వ్యయంతో కూడిన జీవితం కనుకనే - సైన్యాలకు నిత్యావసరా లకు సరఫరా చేసే పనికి ఒప్పుకున్న బెంజమిన్‌కు అందులోంచి ఒకషిల్లిం గయినా లాభం పొందాలి అన్న ఆశ లేకపోయింది !

ఆశ వున్నచోట అవసరం ఏర్పడుతుంది. అవసరం అన్నదానికి రాజమార్గంకన్న అడ్డదారే ఎక్కువ సన్నిహితం. అడ్డదారి ఒకరికి నలుగురు తొక్కిన నాడు సమాజం యావత్తూ దారి కోల్పోవడం సహజం. వ్యక్తిలోని అవసరమైన ఆశ సమాజంలో అవినీతికి విత్తన రూపం మాత్రమే—అని బెంజమిన్ జీవితం నిరూపిస్తుంది.

కొంతకాలం సైనికుడిగా, కొంతకాలం యుద్ధ వ్యూహాల రచయితగా పనిచేసిన బెంజమిన్ జనంనుండి చందాలు వసూలుచేసి పెన్సిల్వేనియాలో ఆస్పత్రి కట్టించాడు. ఆ రాష్ట్రంలో ఎవరయినా ప్రజాహిత కార్యక్రమం తలపెట్టి, ప్రజలదగ్గరికి వెళ్ళితే ''ఈ విషయం బెంజమిన్ ఫ్రాంక్లిన్‌తో

చర్చించారా'' అతడు ఇందుకు అంగీకరించారా'' అని అడిగేవారట! వీధి దీపాలకు కొత్త నమూనాల దగ్గరనుండి తత్వవేత్తల సంఘస్థాపన వరకు కృషిచేసిన బెంజమిన్ ఒకచోట — ''మీరు మంచి చేయదలచుకున్నప్పుడు దానిని పరుషమైన వాక్కుతోగాక, చల్లనిమాటతో సాధించండి. 'మాట' అన్నది భగవంతుడు మనకిచ్చినది ఒకరినొకరు కలుసుకోవడానికి, అర్థం చేసుకోవడానికి జ్ఞానం ఆర్జించడానికే గానీ వైరుధ్యాలు, వైషమ్యాలు పెంచుకోవడానికి కాదు'' అంటాడు. సాహిత్యానికిగాని, సంభాషణకు గాని ఇంతకన్నా మంచి నిర్వచనం ఏమి వుండగలదు ?

భగవంతుడి సాక్షాత్కారం, పునర్జన్మలమీదున్న, చర్చికి వెళ్ళడం కన్న మనిషి నడకమీద ఎక్కువ నమ్మకం గల్గిన బెంజమిన్ ఫ్రాంక్లిన్ – ''మత గ్రంథాలలో ఆదేశించిన చెడ్డవన్నీ చెడ్డ కాకపోవచ్చు. మంచివన్నీ మంచివి కాకపోవచ్చు వాటి మంచి చెడ్డలు అవి ఆ గ్రంథాలలో వున్నందు వల్ల కాక స్వతస్సిద్ధంగా వాటికున్న గుణాలనుబట్టి సంక్రమించినవి అయి వుంటాయి. అంచేత ఆయా గుణాలు, నియమాలు - అవే ముఖ్యం కాని వాటిని ఎవరు, ఎక్కడ చెప్పారు అన్నది కాదు. మనిషికి మనిషికి మధ్య-సత్యం, నీతి, నిజాయితీ–వుండినట్లయితే సంఘజీవితం హాయిగా వుంటుంది. ఈ సూత్రాన్ని నమ్మినందువలననే నా యవ్వనంలో, దూరదేశాలలో, సలహాలివ్వడానికి పెద్దవారెవరూ లేని అనేకానేక సందర్భాలలో నేను ఎప్పుడూ పొరపాట్లు చేయకుండా నెట్టుకు రాగలిగాను'' అని వివరించాడు.

ఆనాటి అమెరికాలో చీకట్లు లేకపోలేదు. తాగుబోతులు, దగా కోరులు, అధికార రోగపూరిత బధిరాంధక శవాలూ లేకపోలేదు కాని పంకం నుండి పంకజం పుట్టినట్లుగా అంత చీకటికి దాసోహం అనక వెలుగు రేకయై నిల్చిన బెంజమిన్ ఫ్రాంక్లిన్ ఈనాటి మన చీకటిలో ప్రతి వ్యక్తి ఎలా తలఎత్తి నిలబడాలో చెప్పే దివ్యకిరణంవంటివాడు !

---